# అల్లరి

ALLARI



## పద్యం - భావం

**శ్రీగల భాగ్యశాలి(గడ(జేర(గవత్తురు తారుదారె దూ**
**రాగమన ప్రయాసమున కాదట నోర్చియునైన నిల్వను**
**ద్యోగముచేసి; రత్ననిలయుండని కాదె సమస్త వాహినుల్**
**సాగరు జేరుటెల్ల ముని సన్నుత మద్గురుమూర్తి భాస్కరా!**

**భావం:** జనాలు భాగ్యవంతుల దగ్గరికి చాలా దూరం నుంచీ, శ్రమ పడి మరీ.. తామంతట తామే వస్తారు. ఎలాగంటే.. రత్నాలకు నిలయమైన సముద్రంలోకి నదులన్నీ ప్రకృతి సిద్ధంగానే వచ్చి చేరుతాయి కదా! అలాగే సంపదలు ఉన్న వారి దగ్గరికి ఆహ్వానం లేకున్నా.. జనాలు వస్తారని భావం.





## చెప్పుకోండి

- పచ్చని బాబుకు రత్నాల ముగ్గులు?
  **- విస్తరాకు**
- తడిస్తే గుప్పెడు.
  ఎండితే బోదెడు?
  **- దూది**
- మూతలేని భరిణెలో
  మున్నూరు రత్నాలు?
  **- దానిమ్మపండు**

## రంగులేయండి



**చుక్కల ఆధారంగా బొమ్మగీసి, రంగులు వేయండి.**



## దెబ్బకు దెబ్బ

... ✍ పత్తిపాక మోహన్

**ఒక ఊళ్లె** ఒక అప్పులిచ్చేటాయినె ఉంటుండె. ఆయినె పేరు సుబ్బయ్య. మంచికో - శెడ్డకో.. ఆపతికో - సంపతికో.. ఆ ఊళ్లె ఆయినె తాన అప్పు దీస్కోక తప్పకపోతుండె. అందరు ఆయినె తాన పైసలు దీస్కోని పరేషాన్ అయినోళ్లే! అదే ఊళ్లె ఉన్న నర్సయ్య మాత్రం.. ఎన్నడు సుబ్బయ్య తానకు శేపోయి అప్పు దీస్కోలే. 'ఈడొక్కడే నా పాలిన వల్లే!' అంట మెరమెరగుండేది సుబ్బయ్యకు. అన్ని దినాలు ఒక్క తీర్గ ఉండయి గాదుల్ల. ఓపారి నర్సయ్యకు పైసల అక్కర కుత్కెల కాడికి అచ్చింది. గచ్చంత్రం లేక సుబ్బయ్య తానకు శేపోయి కోసం బోయిండు. మిగిలినొక్కడు గూడ తన గల్మలకు అచ్చేటాల్లకు.. మస్తు ఖుషీ అయిండు సుబ్బయ్య. అయితె.. తన కుతి దీరేదాంక నర్సయ్యను సతాయించి సంబుర వడుదామని ఇకమతు జేశిండు. రేపు - మాపు అనుకుంట.. మాలెస్క ఆరానికెక్వ రోజులు ఇంటి సుట్టు తింపుకొని, అడ్డికి పైసలిచ్చిండు. గీ కతంత సుబ్బయ్య పక్కింట్లున్న నారాయణ సూడవట్టిండు. నర్సయ్యను వడివోశినట్టు తిప్పిచ్చుకునుడు జూశి.. ''సుబ్బయ్య గంత ఇజ్జత్ తీశినట్టుగ జేశినా.. ఎందుకని ఊకున్నవు? పైసలెందుకు శేపోయి దీసుకున్నవు?'' అంట అడిగిండు. నర్సయ్య నవ్వుకుంట.. ''అవుబావా! సుబ్బయ్య అప్పిచ్చేతందుకు నన్ను ఆరం రోజులు తిప్పిచ్చిండు. దెబ్బకు దెబ్బ గొట్టుడు నాగ్గూడ ఎర్కనే! పైసలు ఆపసిచ్చేది నేనే గదనే! నేను గట్లనే నాలుగైదు నెల్లు దింపుకొని ఇస్త! నువ్వే సూత్తవు గద కత!'' అంట నవ్వుకుంట వోయిండు.



## మంచిమాట

**కోపం చేతల్లో కాదు..**
**మాటల్లో మాత్రమే ఉండాలి.**
**ప్రేమ మాటల్లోనే కాదు..**
**చేతల్లో కూడా ఉండాలి.**

## మీకు తెలుసా?



ఇంగ్లిష్‌లో 'కలెక్టివ్ నౌన్స్' ఉంటాయి. తెలుగులో అయితే 'సామూహిక నామ వాచకం' అంటారు. దీన్ని జంతువులు, వ్యక్తులు లేదా వస్తువుల సమూహం లేదా సంఖ్యను సూచించడానికి ఉపయోగిస్తారు. చేపల గుంపు పేరు.. 'స్కూల్'. అలాగే.. సింహాల సమూహాన్ని 'ప్రైడ్' అని వ్యవహరిస్తారు. అలానే, కాకుల గుంపును 'మర్డర్' అని పిలుస్తారు.